సాక్షి తిరుపతి

బుధవారం ၊ 27 ၊ డిసెంబర్ ၊ 2023



గంజాయి స్వాధీనం

ఇద్దరు విద్యార్థుల నుంచి 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన వెంకటగిరిలో చోటు చేసుకుంది. - 8లో



ఆణిముత్యాలను వెలికితీద్దాం

గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్రా చక్కటి వేదికని తుడా చైర్మన్ తెలిపారు. - 8లో



కబళిస్తున్న బెట్టింగ్ భూతం!

సులువుగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో కొందరు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఘనంగా మహాచండీయాగం



మహాచండీయాగంలో అర్చకులు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని మంగళవారం మహాచండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖ డాక్టర్ దంపతులు డాక్టర్ సాయిబాబా, డాక్టర్ మస్తానమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, చిట్టేటి పెరుమాళ్లు, ఆలయ పాలకమండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిత



సర్టిఫికెట్లు అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్

గూడూరు రూరల్: నేటి యువత దేశ భవిష్యత్తు నిర్ణయించే స్థాయికి చేరుకుందని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ రంగజనార్ధన్ తెలిపారు. గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందన్నారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపల్ ధనుంజయ, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు కృతజ్ఞతలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయ పోటు కార్మికులు, వాహన బేరర్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జరిగిన పాలక మండలి సమావేశంలో పోటు కార్మికులకు రూ.10వేలు వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. తమకు ఇంత పెద్ద మొత్తంలో వేతనం పెరుగుతుందని కలలో కూడా ఊహించలేదన్నారు. దీనివల్ల సుమారు 600 కుటుంబాలకు మేలు జరిగిందని తెలిపారు. అంతకు ముందు వాహన బేరర్లు చైర్మన్‌ను కలిసి తమను స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తిస్తూ నిర్ణయం తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

29న ఐటీఐలో జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు చేపట్టే ఇంటర్వ్యూలకు ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి 3 నెలల పాటు ఉచిత శిక్షణ, అనంతరం ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు సర్టిఫికెట్లతో మేళాకు రావాలని కోరారు. వివరాలకు 7799679351 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ముగిసిన తెప్పోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి ఆరంభమై ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా సాగిన స్వామివారి తెప్పోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు రాత్రి శ్రీచండికేశ్వర స్వామివారు, శ్రీచంద్రశేఖర స్వామివారు తెప్పలపై ఆశీనులై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. విద్యుద్దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా రూపొందించిన తెప్పలను అధిరోహించి పుష్కరిణిలో తొమ్మిది చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర నీరాజనాలు అందించి స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చిత్తూరు : ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



తిరుపతిలో జ్యోతి ప్రజలన చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి తదితరులు

చరిత్రలో నిలిచేలా ఆడుదాం

"యువతలో నైపుణ్యాలకు మెరుగులు దిద్దాలి.. క్రీడల్లో ఉత్తమంగా రాణించేలా ప్రోత్సహించాలి.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను సైతం దీటుగా నిలబెట్టాలి.. దేశానికే వన్నె తీసుకువచ్చేలా మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి''.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర పేరిట ఆటల పోటీలకు శ్రీకారం చుట్టారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెల్లడించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా యువతీయువకులు క్రీడా స్ఫూర్తిని చాటుకుంటూ తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు.

- ఘనంగా ఆడుదాం ఆంధ్ర పోటీలకు శ్రీకారం
- అధిక సంఖ్యలో పాల్గొన్న క్రీడాకారులు
- పండుగ వాతావరణంలో సంబరాలు
- చిత్తూరు, తిరుపతిలో ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి



చిత్తూరులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



తిరుపతిలో షటిల్ ఆడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలు దేశచరిత్రలో మైలురాయిగా నిలిచిపోతాయని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం చిత్తూరులోని మెసానికల్ మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతిలోని ఎస్వీజీఎస్ఎం నగరపాలక ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభించారు. క్రీడా టార్చ్ రిలేను జిల్లా క్రీడాకారులకు అందించి, మస్కట్ లోగో, జాతీయ పతాకం, ఆడుదాం ఆంధ్ర జెండాను ఆవిష్కరించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఆడుదాం ఆంధ్ర పేరిట ప్రతిష్టాత్మక క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని యువత క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజేతలకు బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని కోరారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి వారిని మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ఆడుందాం ఆంధ్ర లక్ష్యమన్నారు. ఇకపై ఏటా డిసెంబరులో ఈ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇదివరకే తిరుపతిలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అద్భుతంగా జరిపించారని కొనియాడారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ సైతం తిరునగరిని మాస్టర్ ప్లాన్ రోడ్లతో సుందరంగా తయారుచేస్తున్నారని ప్రశంసించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పండుగ వాతావరణంలో ఆడుదాం ఆంధ్ర ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ పరిధిలో క్రీడా పోటీలు ఉంటాయని వెల్లడించారు. గ్రామీణ క్రీడలకు ఆడుదాం ఆంధ్ర పోటీలతో పునరుజ్జీవం లభిస్తుందని తెలిపారు. చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు జిల్లాలోని 612 సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్ర ప్రారంభించామన్నారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి జట్లు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. తిరుపతి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్య రక్షణకు ఈ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. తిరుపతి జిల్లాలో వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు 1.70 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వెల్లడించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఇప్పటికీ అవకాశం ఉందని తెలిపారు. చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సచివాలయ పరిధి నుంచి జిల్లా స్థాయి వరకు పండుగ వాతావరణంలో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతి మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఇంత పెద్ద ఎత్తున క్రీడా పోటీలను నిర్వహిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, చిత్తూరు నగర డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత, చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారులు బాలాజీ, సయ్యద్ సాహెబ్, బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడాకారుడు సృజన్ పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో తొలి రోజు 1,232 మ్యాచ్‌లు

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 612 గ్రామ, వార్డు సచివాలయాలకు గాను 413 సచివాలయాల పరిధిలో తొలిరోజు పోటీలు నిర్వహించారు. అందులో షెడ్యూల్ ప్రకారం మొత్తం 1,279 మ్యాచ్‌లకు గాను 1232 మ్యాచ్‌లు జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

తిరుపతి జిల్లాలో తొలి రోజు 1,683 మ్యాచ్‌లు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా మొత్తం 691 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని 481 మైదానాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలి రోజు 432 మైదానాల్లో షెడ్యూల్ ప్రకారం 1,905 మ్యాచ్‌లకు గాను 1683 మ్యాచ్‌లు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.



చిత్తూరులో సభకు హాజరైన ప్రజలు



బెలూన్‌లు ఎగురవేస్తున్న మంత్రి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ



తిరుపతిలో క్రీడా జ్యోతి అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, ప్రజలు

రూ.7.24 కోట్లతో నూతన పార్కింగ్



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, పక్కన ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి భక్తుల కోసం అలిపిరిలో రూ.7.24 కోట్లతో నూతన పార్కింగ్ ఏర్పాటుకు టెండరు ఖరారు చేసినట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మంగళవారం అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అందులో ప్రధానంగా పాలక మండలి ఆమోదించిన అంశాలను ఆయన వెల్లడించారు.

- తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో పాలనా సౌలభ్యం కోసం రూ.6.15 కోట్లతో సెంట్రలైజ్డ్ రికార్డు స్టోర్ నిర్మాణం.
- అలిపిరిలో రూ.7.31 కోట్లతో వంటషెడ్లు, మరుగుదొడ్ల బ్లాక్‌లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, శాశ్వత క్యూలైన్ల ఏర్పాటు
- మరో రూ.1.94 కోట్లతో అలిపిరి బస్టాండు, పార్కింగ్ ప్రాంతంలో బీటీ రెన్యూవల్ రోడ్డు ఏర్పాటు.
- తిరుమల హెచ్‌వీసీ ప్రాంతంలో మిగిలి ఉన్న కాటేజీల్లో రూ.1.82 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పనులు, మరమ్మతులు.
- శ్రీనివాసం విశ్రాంతి సముదాయంలో బస చేసే భక్తుల సౌకర్యార్థం శ్రీనివాసం తూర్పువైపున రూ.2 కోట్లతో ఓపెన్ డ్రెయిన్ నిర్మాణం.
- తిరుమలలో పాత పోలీసు క్వార్టర్స్ రూ.2.87 కోట్లతో అభివృద్ధి.
- రూ.6.32 కోట్లతో వరాహస్వామి విశ్రాంతి గృహం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నాలుగు లేన్ల రోడ్డు.
- చెర్లోపల్లి నుంచి శ్రీనివాసమంగాపురం మార్గంలో నాలుగు లేన్ల బీటీ రోడ్డు, వీధి దీపాలు, డ్రెయిన్లు, సుందరీకరణ పనులకు రూ.17.29 కోట్లతో టెండరు ఖరారు.
- తిరుపతిలో టీటీడీ రోడ్లు, సంస్థలు ఉన్న ప్రాంతాలు, భక్తులు సంచరించే ముఖ్య ప్రాంతాల్లో మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ కోసం టెండర్లను కోర్టు ఉత్తర్వులకు లోబడి కేటాయించాలని నిర్ణయం.
- జార్ఖండ్ రాష్ట్రం దేవ్‌ఘర్‌లో ఆ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన వంద ఎకరాల స్థలంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం నిర్మించేందుకు ఆమోదం.
- చంద్రగిరిలోని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ప్రాకారం, కట్‌స్టోన్‌ఫ్లోరింగ్, స్టోర్ గది, మండపం నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.2 కోట్లు కేటాయింపు.
- తిరుపతిలోని అలిపిరి సప్తగోప్రదక్షిణ మందిరంలో జరుగుతున్న శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమంలో పాల్గొనే భక్తులు తిరుమలలో సుపథం మార్గం ద్వారా రూ.300 టిక్కెట్ కొనుగోలుచేసి శ్రీవారిని దర్శించుకునే అవకాశం.

తదితర అభివృద్ధి పనులకు పాలక మండలి ఆమోదం తెలిపినట్టు చైర్మన్ వెల్లడించారు. సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

భద్రంరొయ్యో!

నకిలీ రొయ్య బ్రూడర్స్ కట్టడికి ప్రభుత్వం చర్యలు

- ఇప్పటికే 50 శాతం వరకు కట్టడి
- ఆక్వా సీడ్ నాణ్యతను పరిశీలించేందుకు ల్యాబ్‌లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆక్వా రైతులు



టైగర్ రొయ్యలకు ఫీడింగ్ ఇస్తున్న రైతు

వాకాడు: ఆక్వా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. రైతులు నష్టపోకుండా 2022 ఏప్రిల్ 1 నుంచి ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి జిల్లాలో ఆక్వా సీడ్ నాణ్యతను పరిశీలించేందుకు టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. అదేసమయంలో రైతుకు గిట్టుబాటు ధర కల్పన, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి పర్యవేక్షణ బాధ్యత 'ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంటు అథారిటీ'కి అప్పగించింది. ఆక్వా కరెంటు చార్జీలు యూనిట్‌కు రూ.4 నుంచి రూ.1.5కు తగ్గించి రైతుకు కొండంత అండగా నిలిచింది. నకిలీలపై నిత్యం దాడులు నిర్వహించేలా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఆక్వా సాగుకు అవసరమైన సూచనలు, సలహా ఇప్పిస్తూ అండదండగా నిలుస్తోంది. దీనిపై రైతాంగం సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తోంది.



ప్రభుత్వ అధికారుల తనిఖీల అనంతరం పెరిగిన నాణ్యమైన రొయ్యల ఉత్పత్తి (ఫైల్)

ఆక్వా సాగు వివరాలు

ఆక్వా సాగు చేస్తున్న మండలాలు: గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, సూళ్లూరుపేట

విస్తీర్ణం : 5 వేల హెక్టార్లు



నాశిరకం ఫీడ్‌తో చనిపోతున్న రొయ్యలు(ఫైల్)

వీటిపై అధికారులు ఓ లుక్కేయాల్సిందే!

జిల్లాలో 21 రొయ్య పిల్లల హేచరీలుండగా నాణ్యమైన రొయ్య పిల్లల ఉత్పత్తికి కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ఎంపెడా ద్వారా అనుమతి పొందిన హెచరీలకు మాత్రమే బ్రోడర్స్(తల్లి రొయ్య)ను సరఫరా చేస్తోంది. ఈ తల్లి రొయ్య ద్వారా ఒక దఫాలో 1 మిలియన్ సీడ్ ఉత్పత్తి అవుతుంది. ఒక బ్రోడర్స్ 3, 4 సార్లు కన్నా ఎక్కువ సార్లు గుడ్లు పెటించకూడదు. అలా కాకుండా ఎక్కువ సార్లు గుడ్లు పెట్టిస్తే నాశిరకం పిల్లలు తయారవుతాయి. అవి చెరువుల్లో వదిలిన వెంటనే కొన్ని చనిపోగా, మరికొన్ని వివిధ రకాల సైజుల్లో పెరడం వల్ల రైతులు నష్టపోతున్నారు. దీన్ని అరికట్టడంపై అధికారులు మరింత దృష్టి సారించాల్సి ఉంది.

మళ్లీ 'టైగర్' పునరాగమనం

దశాబ్దన్నర క్రితం కనుమరుగైన టైగర్ రొయ్యల సాగు ఎంపెడా మళ్లీ సాగులోకి తీసుకొచ్చింది. విదేశాల నుంచి నాణ్యమైన బ్రోడర్స్ తీసుకొచ్చి అన్ని అనుమతులు ఉన్న నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని నాలుగు హెచరీలకు మాత్రమే వీటిని సరఫరా చేస్తోంది. తద్వారా రైతులకు నాణ్యమైన సీడ్ సరఫరా అవుతోంది.

తనిఖీలు చేస్తున్నాం

"జిల్లా వ్యాప్తంగా హెచరీలు, ఫీడ్ షాపులపై తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు హెచరీలను తనిఖీ చేసి నమూనాలను ఎంపెడా ల్యాబ్‌లకు పంపిస్తున్నాం. అలాగే ఫీడ్ షాపుల్లో దాడులు జరిపి కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు లేని మందులను సీజ్ చేస్తున్నాం. ఇప్పటికే దాదాపు రూ.3 లక్షలకు పైగా ఫైన్ విధించాం.

– ఎ.నాగరాజు, జేడీ మత్స్యశాఖ



మట్టిలో మాణిక్యాలను వెలికితీద్దాం

- చంద్రగిరిలో అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం
- ప్రారంభించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



కబడ్డీ విజేత రాయలపురం జట్టును అభినందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న మొట్టమొదటి క్రీడా సంబరం ఆడుదాం ఆంధ్రా అని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల వ్యాప్తంగా సచివాలయాలయ పరిధిలో కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. స్థానిక చంద్రగిరి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కబడ్డీ క్రీడాకారులతో ఆయన కబడ్డీ కూతపెట్టి బరిలోకి దిగారు. కాసేపు కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ముందుగా రాయలపురం-పిచ్చినాయుడుపల్లి మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో 20-6 పాయింట్లతో రాయలపురం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందించారు.

ప్రతిభను వెలికితీయడానికే

మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆడుదాం ఆంధ్రలో చంద్రగిరి నియోజకవర్గ యువత సత్తా చాటాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ప్రతీకలన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిని సీఎం జగనన్న క్రీడల్లో కూడా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలపాలన్న మహోన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా బహుమతుల కోసం ఏకంగా రూ.12 కోట్ల నగదును ప్రభుత్వం ఇవ్వనుందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ బాలాజీ నాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చేగు గోవర్దన్ గుప్తా, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, బోడిరెడ్డి నరసింహారెడ్డి, కొత్తపాటి కోటి, బండారు హేమ చంద్రారెడ్డి పాల్గొన్నారు.



సరదాగా కబడ్డీ ఆడుతున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

వసతులు సమకూర్చ'బడి'

జనవాక్కు

ప్రభుత్వ విద్యరంగంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలనే సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చేసింది. నాడు-నేడుతో మెరుగైన వసతులు సమకూర్చింది. మరోవైపు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా డిజిటల్ తరగతులను ప్రారంభించింది. విద్యార్థులకు ట్యాబ్‌లను అందించి బైజూస్ కంటెంట్‌తో పిల్లలు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకునేలా కార్యాచరణ చేపట్టింది. విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండడం కోసం పోషకాలతో కూడిన మెనూ అమల్లోకి తెచ్చింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తమ పిల్లలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేనమామగా అన్ని వసతులు సమకూర్చుతూ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– తిరుపతి అర్బన్



తొట్టంబేడు మండలంలోని జ్ఞానమ్మకండ్రి పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు
- నాడు-నేడుతో మారిన రూపురేఖలు
- విద్యలోనూ విప్లవాత్మక మార్పులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



తొట్టంబేడు మండలంలోని చిన్న సింగమాల పాఠశాల

క్రమం తప్పకుండా పంపుతున్నాం



నా కుమార్తె భార్గవి నాల్గో తరగతి చదువుతోంది. గతంలో బడిలో మట్టిలో కూర్చుని చదువులు కొనసాగించేంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు-నేడు పేరుతో పాఠశాలలను చక్కగా తీర్చిదిద్దారు. మెరుగైన సౌకర్యాలు కల్పించారు. శుభ్రమైన మరుగుదొడ్లు నిర్మించారు. అలాగే అమ్మఒడి మంజూరు చేస్తున్నారు. చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు ఇస్తున్నారు. టీవీల ద్వారా పాఠాలు చెబుతున్నారు. యూనిఫాం, బూట్లు ఇచ్చారు. ఇలాంటి సౌకర్యాలు గతంలో ఎప్పుడూ లేవు. అందుకే క్రమం తప్పకుండా బిడ్డను బడికి పంపుతున్నాం.

-పూనమల్లి వెంకటరమణమ్మ, బల్లవోలు, చిల్లకూరు మండలం

విద్యలో ఎంతో మార్పు



నా ఇద్దరు పిల్లల్ని బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నాను. ఈ ప్రభుత్వం వచ్చాక గతంలో ఎప్పుడూ చూడనంతగా పాఠశాలల్లో మార్పు వచ్చింది. నేను చదువుకునే రోజుల్లో మా బడిలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు అన్నీ మెరుగైన సౌకర్యాలు సమకూరాయి. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలే మార్చేశారు. ఏ ప్రభుత్వమూ ఈ స్థాయిలో చేయలేదు. పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం బాగుంది. విద్యకు ప్రాధాన్యతనిచ్చి సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. ఆయన రుణం ఈ జన్మలో మర్చిపోలేం.

-నాగూరయ్య, వెస్ట్‌వరత్తూరు, బుచ్చినాయుడుకండ్రిగ

ఇంతకన్నా ఏమి కావాలి?



నేను రోజూ కూలి పనులకు వెళ్లి బతుకు జీవనం సాగించుకుంటున్నాను. ప్రయివేటు బడులకు పంపే స్తోమత లేదు. అందుకే నా కుమారుడు కోటిని సైదాపురంలోని ఉన్నత పాఠశాలలో చేర్పించాను. ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు ఎంతో బాగున్నాయి. పాఠశాలల్లో అన్ని వసతులు సమకూర్చారు. నా బిడ్డకు కావాల్సినవన్నీ ప్రభుత్వమే అందిస్తోంది. ఇంతకన్నా నాకు ఏమి కావాలి?. జగనన్న మాలాంటి పేదలకు ఓ దేవుడులా నిలిశారు. సంతోషంగా ఉంది.

- కుంచం చిన్నక్క, సైదాపురం

ఆకాంక్ష నెరవేరింది



ప్రతి తల్లిదండ్రి తమ బిడ్డలను అన్నీ వసతులు ఉన్న పాఠశాలల్లో చేర్పించాలని భావిస్తారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అంతంత మాత్రంగానే ఉండేవి. దీంతో విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు స్కూళ్ల వైపు వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు నాడు-నేడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బడులన్నింటినీ సర్వాంగ సుందరంగా రూపుదిద్దింది. దీంతో మళ్లీ తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల బాటపట్టారు. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయనకు అండగా ఉంటాం.

- కన్నిముత్తు ఆచారి, విద్యార్థితండ్రి, పిచ్చాటూరు

సీఎం మాటే శిరోధార్యం

– వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయి రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీలో ఎంతమంది ఉన్నప్పటికీ నిర్ణయాధికారం, పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని దీనిని ప్రతి ఒక్కరూ శిరోధార్యంగా భావించాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయి రెడ్డి అన్నారు. కోవూరు నియోజకవర్గంలో మంగళవారం జరిగే సామాజిక సాధికార యాత్రలో పాల్గొనేందుకు రోడ్డు మార్గంలో వెళుతున్న విజయసాయిరెడ్డిని గూడూరు మినీ బైపాస్ వద్ద సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులపై ప్రస్తావించారు. దీనిపై ఆయన స్పందిస్తూ నిర్ణయాధికారం మొత్తం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. ఆయన మాటకు అందరూ కట్టబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన వారిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా పార్టీకోసం పనిచేయాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ కథనం.. తొట్టంబేడు మండలం, బసవయ్యపాళెం మినీబైపాస్‌రోడ్డు సమీపంలోని విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఇంటి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహం ఉన్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు రెండు రోజుల క్రితం మృతిచెందినట్టు తెలుస్తోంది. అతని నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు ఫుల్‌హ్యాండ్ టీషర్ట్, పసుపు రంగు షర్ట్ ధరించినట్టు వెల్లడించారు. అలాగే మృతుడి కుడి చేతిపై పూజా అని పచ్చబొట్టు ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలిసినవారు 9440900008, 9154141887 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

34 విద్యుత్ స్టార్టర్ల చోరీ



చోరీకి గురైన స్టార్టర్

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వ్యవసాయ పొలాల్లో సోమవారం రాత్రి 34 మంది రైతులకు సంబంధించిన విద్యుత్ స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. వ్యవసాయ విద్యుత్ మోటార్ల ద్వారా రైతులు వరిని నాటారు. ప్రభుత్వం పగటిపూట వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడంలో రాత్రిళ్లు రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లడం లేదు. ఇదేఅదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు పొలాల్లోని సుమారు 34 స్టార్టర్లను అపహరించుకెళ్లారు. ఆపై వాటిని పగులగొట్టి, వాటిలోని విలువైన కాపర్ వైరును దొంగలించుకెళ్లారు. మంగళవారం ఉదయం గుర్తించిన రైతులు పోలీసులు, ఎస్పీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

2.5 కిలోల గంజాయి స్వాధీనం

సైదాపురం (వెంకటగిరి): ఈజీ మనీకోసం అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు గంజాయి తరలిస్తూ కటకటాల పాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సెబ్ సీఐ నాగేశ్వరరావు కథనం.. పల్నాడు జిల్లాకు చెందిన రావి వెంకటసాయి, విజయవాడకు చెందిన ఖలీల్‌అహ్మద్ వెంకటగిరిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అనుమానాస్పందంగా తిరుగుతూ కనిపించారు. గుర్తించిన సెబ్ పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద 2.5 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వెంకటసాయి చెన్నైలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతుండగా.. అదే కళాశాలకు చెందిన సీనియర్ విద్యార్థి ఖలీల్‌అహ్మద్‌గా గుర్తించారు. వారి సీనియర్లు, క్యాంపస్‌లో మరి కొందరికి క్యాంపస్‌లో గంజాయి విక్రయించడం వంటి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఎర్రకట్టకు చెందిన మహ్మద్‌వలిఖాన్ వద్ద 2.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి వెంకటగిరి మీదుగా చెన్నైకి వెళ్లేందుకు బస్సులో వచ్చినట్టు తెలిపారు. ఈ మేరకు వెంకటసాయి, ఖలీల్ అహ్మద్, మొహ్మద్ వలిఖాన్‌లపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. ఎస్‌ఐ గంగాధర్, కానిస్టేబుల్స్ మునిశేఖర్, రఫీ, పుట్టయ్య పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బైరెడ్డిపల్లె : స్థానిక చెక్‌పోస్టు కూడలి వద్ద ఎస్ఈబీ అధికారులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో కర్ణాటక మద్యం పట్టుబడింది. ఎస్ఈబీ ఎస్‌ఐ రామదాసు కథనం మేరకు.. కర్ణాటకలోని బంగారుపేటకు చెందిన రమేష్ అనే వ్యక్తి టవేరా వాహనం నుంచి రూ.4లక్షల విలువైన 3,840 టెట్రా ప్యాకెట్లను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఘటనాస్థలం నుంచి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, సిబ్బంది దేవరాజు, మురళి, శివప్రసాద్, అల్తామాస్, సయ్యద్‌బాషా, దేవేంద్ర పాల్గొన్నారు.

ఎస్వీయూ ఐక్యూ ఏసీ డైరెక్టర్‌గా మల్లికార్జునరావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఐక్యూ ఏసీ డైరెక్టర్‌గా ఆచార్య కే.మల్లికార్జునరావు, డెప్యూటీ డైరెక్టర్లుగా డా.కేవీ.సుచరిత, డా.ఎం.ప్రయాగను నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఎస్వీయూ ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య సుందరవల్లి వారికి నియామక పత్రాలు అందజేశారు.

తండ్రికి పిల్లల అప్పగింత

పుత్తూరు: వడమాలపేటలో సోమవారం కనబడకుండా పోయిన అక్కాచెల్లెలు మస్తానీ (13), ఆఫ్రీన్(5)ను తండ్రి అబ్దుల్ రషీద్‌కు పోలీసులు మంగళవారం అప్పగించారు. స్థానిక గుంటకట్ట వీధికి చెందిన ఇద్దరు పిల్లలు తప్పిపోయారంటూ వారి బంధువు రజియా పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తిలోని బంధువుల ఇంట్లో పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారిని తండ్రి చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కబళిస్తున్న బెట్టింగ్ భూతం!

సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశలో కొందరు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడుతున్నారు. తొలుత సరదాగా మొదలు పెట్టి.. అదే వ్యసనానికి బానిసగా మారి బతుకును బలి చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువత బెట్టింగ్ మోజులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. చాలామంది పందేలు కాసి నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. కొందరు ఆత్మహత్యకు పాల్పడి కుటుంబీకులను కోలుకోలేని విషాదంలో ముంచేస్తున్నారు. పల్లెలు.. పట్టణాలనే తేడా లేకుండా పెద్దసంఖ్యలో విద్యార్థులు.. యువకులు ఆన్‌లైన్ యాప్‌ల మాయలో కొట్టుమిట్టాడుతున్నారు.

- ప్రాణాలు తీస్తున్న ఆన్‌లైన్ పందేలు!
- ఛిద్రమవుతున్న యువకుల బతుకులు
- సెల్‌ఫోన్ల ద్వారానే మొత్తం లావాదేవీలు
- అలవాటు పడితే అప్పుల పాలే..



పలమనేరు : ఉమ్మడి జిల్లాలో ఇటీవల బెట్టింగ్ బంగార్రాజులు పెరిగిపోయారు. నిత్యం వేల సంఖ్యలో ఆన్‌లైన్ బెట్టింగులు జరుగుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కేవలం సెల్‌ఫోన్ల ద్వారా జరిగే ఈ బెట్టింగులను గుర్తించడం పోలీసులకు సైతం వీలు కాని పరిస్థితి. ఏదేమైనా బెట్టింగుల కారణంగా యువత జీవితాలు నాశనమవుతున్నాయి. చాలామంది యువకులు బైక్‌లు, బంగారు చైన్లు, ఉంగరాలను అమ్ముకోవాల్సి వస్తోంది. అదీ చాలక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చాలామంది బెట్టింగు వ్యసనానికి బానిసలై చివరకు బలవంతంగా తనువు చాలిస్తున్నారు.

కొంపముంచుతున్న పందేలు

ప్రస్తుతం సాగుతున్న బెట్టింగులు మూడు రకాలుగా ఉన్నాయి. కొంతమంది కలసి ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా బెట్టింగు చేస్తున్నారు. ఇంకొందరు రహస్యప్రదేశాల్లో ఉంటూ లైవ్ క్రికెట్ మ్యాచ్‌లు మొదలైనప్పటి నుంచి గ్రూపుల్లోని వ్యక్తులతో చాటింగ్ చేస్తూ బెట్టింగులు వ్యాపారం సాగిస్తున్నారు. ఎక్కువంది మాత్రం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎక్కువగా ఫైయిర్ మ్యాచ్, బెట్‌వే, 10 క్రిక్, డఫాబెట్, 22బెట్, ఫన్ 88, బెట్ విన్నర్, కామాన్, కసుమో, రబోనా, ఎలెవన్ బెట్, డ్రీమ్-11, ట్వంటీ ఫోర్‌క్లబ్, బీక్రిక్,మోస్ట్‌బెట్, ఐవిన్, మెల్ బెట్, బెట్ 365, పారీమ్యాచ్,ఫెయిర్‌ప్లేటీ గేమ్ యాప్‌లు వాడుతున్నట్లు సమాచారం.

యువతే టార్గెట్

జిల్లా సరిహద్దులో కర్ణాటకలో ముళబాగిలు, శ్రీనివాసపురం, కేజీఎఫ్‌తోపాటు బెంగళూరుకు చెందిన బెట్టింగ్ ముఠాలు జిల్లాలో యథేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ముఠాలకు వందల సంఖ్యలో ఏజెంట్లు ఉన్నట్లు సమాచారం. వీరు యువతను టార్గెట్ చేసుకుని మొబైల్ ద్వారా వారికి రూ.లక్షలు వచ్చాయంటూ చెబుతూ ఊబిలోకి దించుతున్నట్టు తెలిసింది.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..

- రెండు రోజుల క్రితం పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన వెంకటేష్(24) ఆన్‌లైన్ బెట్టింగు కారణంగా రూ.6లక్షల దాకా అప్పులు చేసి వాటిని తీర్చలేక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- బైరెడ్డిపల్లె మండలానికి చెందిన యువకుడు 8 నెలల క్రితం క్రికెట్ బెట్టింగు కారణంగా అప్పుల పాలై బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- పెద్దపంజాణి మండలంలో ఓ యువకుడు ఏడాది క్రితం బెట్టింగ్ కారణంగా సమీపంలోని అడవిలోకి వెళ్లి ఉరేసుకొని ప్రాణం తీసుకున్నాడు.
- మదనపల్లెకు చెందిన ఓ బీటెక్ విద్యార్థి బెట్టింగ్‌కు అలవాటు పడి తీవ్రంగా నష్టపోయాడు. చివరకు పలమనేరులోని పాతపేటలో తన రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత మూడేళ్లలో పదుల సంఖ్యలో జరిగాయి. ఈ క్రమంలోనే వెలుగుచూడనివి వందల్లోనే ఉన్నట్టు తెలుస్తోంది.

పిల్లలను గమనించాలి



పట్టణ ప్రాంతాల్లోని యువకులు సెల్‌ఫోన్ల ద్వారా బెట్టింగులకు పాల్పడడం ఎక్కువైంది. ముఖ్యంగా కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు సైతం పందేలకు అలవాటుపడుతున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలను నిశితంగా గమనించాలి. పట్టించుకోకుండా వదిలేస్తే ఇలాంటి వ్యసనాలకు బానిసలవుతారు.

- రాజేంద్రరెడ్డి, అకడమిక్ డైరెక్టర్, మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీ, పలమనేరు

ప్రత్యేక నిఘా



బెట్టింగులను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. దీనిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాం. స్మార్ట్‌ఫోన్లలో సాగే బెట్టింగ్ వ్యవహారాలను కనుక్కోవడం కొంచెం కష్టమే. అయితే బాధితుల ద్వారా కీలక సమాచారాన్ని తెలుసుకొని బెట్టింగు ముఠాలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.

- సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ, పలమనేరు